ప్రజాశక్తి
సోమవారం 5 మే 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

'దారి' కాచిన మృత్యువు

ప్రమాదంలో పూర్తిగా ధ్వంసమైన కారు

- అతివేగం, నిర్లక్ష్యం కారణంగా ఐదు ప్రాణాలు బలి
- ఒంగోలులో వరుస రోడ్డు ప్రమాదాలు
- ఐదుగురు మృతి., మరో నలుగురికి గాయాలు
- ఘటనాస్థలాన్ని సందర్శించిన ఎస్‌పి దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

లారీ డ్రైవర్ల అతి వేగం, నిర్లక్ష్యం కారణంగా ఐదు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. 500 మీటర్ల దూరంలో 10-15 నిమిషాల వ్యవధిలో జరిగిన మూడు వేర్వేరు ప్రమాదాలలో 9 వాహనాలు ధ్వంసమయ్యాయి. ప్రమాదాలలో ఐదుగురు మృత్యువాతపడగా, మరో నలుగురు గాయపడ్డారు. 16వ నెంబర్ జాతీయ రహదారిపై జరిగిన మూడు ప్రమాదాలు చూపరులను ఒళ్లు గగుర్పాటుకు గురి చేశాయి. కోడిగుడ్ల లారీ మొత్తం ధ్వంసం కాగా, లారీ, కంటెయినర్ మధ్య కారు ఇరక్కుపోయింది. కారు ముందు భాగంలోని సీట్లు, ఊడిపోయి చెల్లాచెదురుగా పడిపోవటం ప్రమాద తీవ్రతకు అద్దం పడుతోంది. జెసిబిలు, పొకెయినర్ల సాయంతో ధ్వంసమైన వాహనాలను పోలీసులు బయటకు తీశారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం వేకువజామున 4.50 గంటలకు జాతీయ రహదారిపై ఒక లారీకి పంక్చర్ కావటంతో రోడ్డుకి కుడివైపున ▶ 2లో

ప్రమాద స్థలాలను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్, పోలీసు అధికారులు, డీటీసీ

మృతిచెందిన రమణయ్య, బాబు, నాగేంద్ర

నుజ్జునుజ్జయిన కోడిగుడ్ల లారీ

శింగరాయకొండలో కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

న్యాయం కోసం పనిచేయాలి

- న్యాయవాదులకు హైకోర్టు న్యాయమూర్తుల సూచన
- శింగరాయకొండలో కోర్టు ప్రారంభం

▶ 8లో

పిడుగుల వాన

- బాపట్ల జిల్లాలో పిడుగులు పడి ఇద్దరు మృతి
- ప్రకాశం జిల్లా, నాగులప్పలపాడులో మరొకరు..
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

నాగమల్లేశ్వరరావు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా, నాగులుప్పలపాడు

బాపట్ల జిల్లాలో ఎక్కువ చోట్ల, ప్రకాశం జిల్లాలో పలు చోట్ల ఆదివారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఎక్కువ చోట్ల పిడుగులు పడ్డాయి. పిడుగుల కారణంగా బాపట్ల జిల్లాలో ఇద్దరు, ప్రకాశం జిల్లాలో ఒకరు మృత్యువాతపడ్డారు.

బాపట్ల జిల్లాలోని దాదాపు అన్ని మండలాల పరిధిలో ఆదివారం ఉదయం నుంచి ఉరుములు, పిడుగులతో కూడిన భారీవర్షం కురిసింది. చినగంజాం మండలం సోపిరాల సమీపంలోని రొంపేరు కాలువ వద్ద పిడుగుపాటుకు గురై పశువుల కాపరి గడ్డం బ్రహ్మయ్య (50) అక్కడికక్కడే మతి చెందాడు. కొల్లూరు మండలం, గాజుల్లంకలో కృష్ణా నది సమీపంలో కృష్ణాజిల్లా క్రోసూరు నుండి వస్తున్న మాతంగి సుప్రదీప్ (31) వెల్డింగ్ పనుల కోసం కొల్లూరు వస్తుండగా పిడుగు పడి మరణించాడు. నాగుల్పుపలపాడు మండలం, ఈదుమూడికి చెందిన విక లాంగుడు, గొర్రెల కాపరి కొండేపి నాగమల్లేశ్వర రావు(40) పొలంలో గొర్రెలు మేపు తుండగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చీరాల మండలం, కొత్తపాలెంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి పిట్టు పోతురాజు అనే రైతుకు ▶ 2లో

పిడుగుపాటుకు మృతిచెందిన ఎడ్లు

నీట్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ప్రశాంతంగా నీట్ పరీక్షలు

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

▶ 5లో

భగీరథుని అంకురిత దీక్షే స్ఫూర్తి

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

ప్రజాశక్తి మార్కాపురం

భగీరథుని అంకురిత దీక్షను మనందరం స్ఫూర్తిగా తీసుకోవాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచించారు. భగీరథ జయంతి వేడుకలు ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. 'సగర సంఘం' మార్కాపురం శాఖ ఆధ్వర్యంలో రాజర్షి భగీరథ మహర్షి జయంతి వేడుకలు స్థానిక హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు వద్ద ఆదివారం ఘనంగా జరిగాయి. అక్కడ ఉన్న భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ వేడుకలకు సగర సంఘం గౌరవాధ్యక్షులు సతికెల రామకృష్ణ, అధ్యక్షులు కొప్పుల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో పాటు జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడారు. కఠోర దీక్ష చేయడంలో భగీరథను మించిన వారు లేరన్నారు. సగర వంశస్తులు విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రాణించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పాదచారులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. సగర సంఘం మార్కాపురం శాఖ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం మార్కాపురం అధ్యక్షుడు కొప్పుల వెంకటేశ్వర్లు తెలిపారు.



భగీరథకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కందుల

ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మేడిగా వీరాంజనేయులు, కోశాధికారి మట్టం వెంకటేశ్వర్లు, రిటైర్డు ప్రిన్సిపాల్ యాసం బాలశంకరయ్య, కార్యవర్గ సభ్యులు నక్కా వెంకటరమణ (బ్రిక్స్), పసుపుల వెంకటేశ్వర్లు (బిల్డర్), పోలెబోయిన సుబ్బారాయుడు, పిన్నెబోయిన శ్రీనివాసులు, కొప్పుల వెంకటరమణ, మట్టం శ్రీనివాసులు, పసుపులేటి చిన్న నరసింహులు, ఈర్నపాటి సుబ్బారావు, మాజీ కౌన్సిలర్ కొప్పుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'దారి' కాచిన మృత్యువు

(మొదటిపేజీ తరువాయి)

డ్రైవర్ లారీని ఆపారు. పంక్చర్ వేసుకొని బయలుదేరుతుండగా తెలంగాణ రాష్ట్రం, భువనగిరి నుంచి నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడుకి కోడిగుడ్ల లోడుతో వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఆ వెనుకనే హార్వెస్టర్ యంత్రాన్ని తీసుకెళుతున్న మరో వ్యాన్ కోడిగుడ్ల లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కోడిగుడ్ల లారీ తిరగబడి నెలూరు నగరానికి చెందిన డ్రైవర్ షేక్ రహీం అలియాస్ రమణయ్య(60), నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడుకి చెందిన క్లీనర్లు రావినూతల బాబు(42),
రావినూతల నాగేంద్ర(20) మృత్యువాత పడ్డారు.

వ్యతిరేక దిశలో వచ్చిన ట్రాక్టర్

ఈ ప్రమాదం జరిగిన మరో 10 నిమిషాలకు అదే మార్గంలో వ్యతిరేక దిశలో ఇటుకలు తీసుకెళుతున్న ట్రాక్టర్ వస్తుండగా ఓ వ్యాన్ ముందు నుంచి ఢీకొట్టింది. ఈ వ్యాన్‌ను వెనుక వస్తున్న మరో కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి.

దైవ దర్శనానికి వెళుతూ.. మృత్యుఒడికి..

మరో 15 నిమిషాలకు ఇదే మార్గంలో ప్రయాణిస్తున్న ఓ లారీ డ్రైవర్ ప్రమాదాన్ని చూసి బ్రేక్ వేయగా, వెనుక వస్తున్న కారు నెమ్మదిగా పోతోంది. నాగాలాండ్ నుంచి చెన్నై పోర్టుకి వెళుతున్న కంటెయినర్ వేగంగా వచ్చి కారును ఢీకొట్టింది. లారీ, కంటెయినర్ మధ్య కారు ఇరుక్కొని నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న గుంటూరు జిల్లా పెదకాకాని మండలం, కొప్పురావూరుకి చెందిన తల్లీకొడుకులు తిరుమలశెట్టి పావని(35), తిరుమలశెట్టి చంద్ర కౌశిక్(14) మృతిచెందారు. ప్రమాదంలో తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు, బూసి వినయ్, బూసి లావణ్యకు గాయాలయ్యాయి. రెండేళ్ల లోక్షిత్ సురక్షితంగా బయటపడ్డాడు. గాయపడిన వారిని ఒంగోలులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు. వీరిలో బూసి వినయ్‌కు తలకు బలమైన గాయం తగలటంతో సర్జరీ చేయాలని వైద్యులు సూచించారు. లావణ్య వెన్నెముకకు గాయాలు కావటంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. వీరంతా తిరుమలకు దైవ దర్శనానికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

ఐదుగురు మరణించటం దురదృష్టకరం

ఎస్‌పి ఏఆర్ దామోదర్

కొప్పోలు 16వ నెంబర్ జాతీయ రహదారిపై జరిగిన వరుస ప్రమాదాలలో ఐదుగురు మృత్యువాత పడటం దురదృష్టకరమని జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ తెలిపారు. ప్రమాదాలు జరిగిన వెంటనే ఎస్‌పి స్వయంగా సంఘటనాస్థలికి చేరుకొని ప్రమాదానికి గురైన కోడిగుడ్ల లారీ, కార్లను జెసిబిలు, పొక్లెయినర్ల ద్వారా బయటకు తీయించి క్షతగాత్రులను హాస్పిటల్స్‌కు తరలించారు. అనంతరం మీడియాతో ఎస్‌పి మాట్లాడుతూ వాహనచోదకులు వేగ పరిమితుల పట్ల జాగ్రత్త వహించి వాహనాలు నడపాలని, రహదారి భద్రత నియమాలు పాటిస్తూ సురక్షితంగా, క్షేమంగా గమ్యాన్ని చేరుకోవాలన్నారు. నేషనల్ హైవే 16 ఒంగోలు నుండి నెల్లూరు వైపు వెళ్లు మార్గంలో ఆదివారం ఉదయం సుమారు 4.50 నిమిషాలు మూడు వేర్వేరు రోడ్డుప్రమాదాలలో ఐదుగురు మరణించటం అత్యంత బాధాకరమన్నారు. మతిచెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదం జరిగిన తీరు, కారణాలు, పరిస్థితిని నిశితంగా సమీక్షించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవడానికి సమగ్ర విచారణ జరుపుతున్నామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అతివేగం మరియు నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌పి వెంట అదనపు ఎస్‌పి కె.నాగేశ్వరరావు, ఒంగోలు డిఎస్‌పి ఆర్ శ్రీనివాసరావు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆర్.సుశీల, ఒంగోలు తాలూకా, టుటౌన్ సిఐలు అజయ్ కుమార్, ఎం.శ్రీనివాసరావు, ట్రాఫిక్ సిఐ పాండురంగారావు, గిద్దలూరు సిఐ సురేష్, నేషనల్ హైవే అధికారులు, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే 'కందుల'

వికలాంగుడికి సాయం అందిస్తాం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మండలంలోని బిరుదుల నరవ గ్రామానికి చెందిన ఇప్పర్ల శేఖర్ నూరు శాతం వైకల్యంతో బాధపడుతున్నాడు. ఇతరుల సాయం లేనిదే కదల్లేడు. ప్రభుత్వం రూ.6 వేల పింఛను ఇస్తోంది. నూరు శాతం వైకల్యం కలిగిన వారికి రూ.15 వేలు ఇచ్చే అవకాశం ఉంది. ఈ విషయమై 'ఇప్పర్ల శేఖర్' మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని ఆదివారం కలిశారు. తన ఆర్థిక ఇబ్బందులు వివరించారు. తనకు పింఛను తప్ప మరో ఆధారం లేదన్నారు. రూ.15 వేల ఫించనుకు అర్హత ఉందని, ప్రభుత్వం తరపున సాయం అందించాలని కోరాడు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఈ విషయంపై స్పందించారు. రూ.15 వేల ఫించను ఇప్పిస్తానని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హామీ ఇచ్చారు.

పిడుగుల 'వాన'

(మొదటిపేజీ తరువాయి)

చెందిన రెండు ఎడ్ల పైన పిడుగు పడటంతో అవి మృతి చెం దాయి. రూ.లక్షన్నర విలువ గలిగిన వ్యవ సాయం చేసే ఎద్లు మరణించడంతో రైతు ఆవేదన చెందుతున్నాడు. పిడుగులు మరిన్ని చోట్ల పడే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

అధికారులను అప్రమత్తం చేసిన 'గొట్టిపాటి'

జిల్లాలో భారీ గాలులతో, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురియడంతో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను అప్రమత్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గాలివానకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను వెంటనే పునరుద్ధరించి విద్యుత్ సరఫరా చేయాలన్నారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్.నెం.363/2024

గోళ్ళ అంజయ్య ..... వాది

వర్సెస్

గోపనబోయిన కేశవులు ...ప్రతివాది

టు

గోపనబోయిన కేశవులు
తండ్రి నాగయ్య
రాజగోపాల్ రెడ్డి నగర్ గ్రామము,
ముండ్లమూరు మండలం, ప్రకాశం జిల్లా

పై దావాలో వాది కోర్టు ద్వారా మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు నోటీసు జారి నిమిత్తం వాయిదా తేదీ 09-05-2025కు వాయిదా వేసి ఉన్నారు. ఆరోజు మీరు స్వయంగా గాని ప్లీడర్ ద్వారా కానీ హాజరు పడి మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడనని తెలియజేయడమైనది.

వాయిదా తేదీ :9-05-2025

ఇట్లు
యర్రమోతు రమేష్ బాబు,
M A.,M. B A.,L.L.B
అడ్వకేట్ అద్దంకి.
సెల్ :9966046270

దావా సనుసు

మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS No : 25/2025

Between:-
గొట్టిపాటి శ్రీనివాసరావు ...... వాది
మరియు
మువ్వల సుబ్రమణ్యం ....ప్రతివాది

To

మువ్వల సుబ్రమణ్యం S/o లేటు ఆంజనేయులు
డోర్ నెం.12-31, పర్చూరు, బాపట్ల జిల్లా.

పై నంబరు గల దావాను మీపై దాఖలు చేసి మీకు ఎన్ని మార్లు దావా సమన్లు పంపిననూ చేరనందున ఈప్రకటన ద్వారా మీకు తెలియ జేయునది ఏమనగా ది.15-05-2025న ఉదయం 10-30ని.లకు వాయిదా ఉన్నందున మీరు స్వయముగా గానీ వకీలు గారి ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల మీ పరోక్షము నందు దావాను విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)

వాయిదా తేది : 15-05-2025

ఇట్లు
రావి సత్యనారాయణ
రావి శ్రీనివాసరావు
CH శ్రీ రమణి
న్యాయవాదులు, పర్చూరు.

జిల్లా నీరు మరియు పారిశుధ్య మిషన్ - బాపట్ల జిల్లా, బాపట్ల

స్వచ్ఛ భారత్ మిషన్ ప్రోగ్రాంలో పనిచేయుటకు ఈ క్రింద తెలిపిన కాంట్రాక్టు ఉద్యోగాల కొరకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడమైనది.

1) **SWM కన్సల్టెంట్ :** సైన్స్ లేదా ఆర్ట్స్ లో డిగ్రీ, కనీసం 50% మార్కులతో పాస్ అయి ఉండాలి. **Computer** పరిజ్ఞానం ఉండాలి. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

2) **LWM కన్సల్టెంట్ :** సైన్స్ లేదా ఆర్ట్స్‌లో డిగ్రీ, కనీసం 50% మార్కులతో పాస్ అయి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

3) **MIS కన్సల్టెంట్ :** స్టాటిస్టిక్స్ లేదా కంప్యూటర్ సబ్జెక్టులతో డిగ్రీ, కనీసం 50% మార్కులతో పాస్ అయి ఉండాలి. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

పై ఉద్యోగాలకు దరఖాస్తులు, సంబంధిత సర్టిఫికెట్స్ ను జతపరచి తేది: 06.05.25 మధ్యాహ్నం 1 గంట లోపు మెంబెర్ సెక్రటరీ & Dist RWS Engg officer (SE RWS) Bapatla వారి కార్యాలయానికి సమర్పించవలెను. తదుపరి ఇంటర్వ్యూకు అదే రోజు అనగా తేది: 06.05.2025 సాయంత్రం 4 గంటలకు హాజరు కావలెను. వివరములకు ఫోన్ 9100121403 ని సంప్రదించవలెను.

సం// చైర్మన్ & డిస్ట్రిక్ కలెక్టర్,
జిల్లా నీరు మరియు పారిశుధ్య మిషన్,
బాపట్ల జిల్లా, బాపట్ల.

కొనుగోలు కేంద్రంలో కందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

కందుల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

కందుల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. తాళ్లూరులోని కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా పంటలు వేగంగా విక్రయించుకునే అవకాశం ఉందన్నారు. రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈక్రాప్ పద్ధతిలో వచ్చే సమస్యల కారణంగా పండించిన పంటను విక్రయించలేక ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు తెలియజేశారు. నిబంధనలు సడలించి పండిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసేలా కృషి చేయాలని కోరారు. సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట టిడిపి నాయకులు బాలు ఓబుల్ రెడ్డి ఉన్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

పలుచోట్ల ఈదురు గాలులు, వర్షం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని ఈదుమూడి గ్రామంలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. ఈదుమూడి గ్రామానికి చెందిన దివ్యాంగుడైన గొర్రెల కాపరి కొండేపి నాగమల్లేశ్వరరావు(40) రోజులాగే ఆదివారం తన గొర్రెలను తోలుకొని పొలానికి వెళ్లాడు. ఒక్కసారిగా వర్షంతో పాటు పెద్ద శబ్దాలతో పిడుగు పడటంతో పొలంలో గొర్రెలను మేపుకుంటున్న నాగమల్లేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న సచివాలయ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలతో పాటు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు ఉన్నారు. కుటుంబాన్ని పోషిస్తున్న మల్లేశ్వరావు మృతి చెందడంతో వేము ఎట్లా బ్రతకాలని కుటుంబ సభ్యులు బోరున విలపించడం చూపరులను కంట తడి పెట్టించింది.

రోడ్డుపై అడ్డుగా పడిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం

రోడ్డుపై కూలిన చెట్టు.. రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి-టంగుటూరు

జరుగుమల్లి మండలంలోని పాలేటిపాడు గ్రామం వద్ద ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు వీచిన ఈదురు గాలులకు పాలేటిపాడు రైస్ మిల్లు దాటిన తరువాత వేపచెట్టు ఆర్అండ్‌బి రోడ్డుకి అడ్డంగా పడిపోయింది. దీంతో కొండపి-టంగుటూరు రహదారిలో రాకపోకలకు అంతరాయం కలిగింది. స్పందించిన జరుగుమల్లి యస్ఐ బి.మహేంద్ర జేసీబి సాయంతో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన వేప చెట్టును తొలగించి రాకపోకలకు వీలు కల్పించారు. టంగుటూరు మండలం జముమ్మలపాలెం గ్రామానికి చెందిన మక్కెన వెంకటరావు సహాయంతో జేసీబి తెప్పించి వేప చెట్టుని తొలగించారు. వేగంగా స్పందించిన జరుగుమల్లి ఎస్ఐ మహేంద్ర, జేసీబి సమకూర్చి మానవత్వం చాటుకున్న మక్కెన వెంకటరావులను ప్రజలు అభినందించారు.

చెక్కు అందజేస్తున్న దృశ్యం

ప్రీతమ్ వర్షిత ట్రస్టు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

అనారోగ్యంతో బాధ పడుతుతున్న వ్యక్తికి ఒంగోలు ప్రీతమ్ వర్షిత హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆర్థిక సాయం అందించింది. నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం నరవాడ గ్రామానికి చెందిన వృద్ధుడు పి.నరసింహులు లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ అనారోగ్యంతో వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్నాడు. వీరి స్థితిని గమనించిన ఫౌండేషన్ నిర్వాహకులు కొమ్మి రమణయ్య, రాజేశ్వరి దంపతులు ఆదివారం నాడు ఆయనకు వైద్య ఖర్చుల నిమిత్తం తమ ట్రస్టు తరపున రూ.10 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ అధ్యక్షులు మారెళ్ల సుబ్బారావు, మోటుపల్లి వెంకటేశ్వర్లు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు సమగ్ర ప్రణాళిక

నాబార్డ్ సలహాదారులు తోట ప్రభాకర రావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

వేసవి నీటి ఎద్దడిని నిలువరించేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామీణ నీటి సరఫరా అధికారులతో శనివారం సాయంత్రం బేటీ అయ్యారు. ఈ భేటీలో ప్రకాశం జిల్లాకు చెందిన రిటైర్డ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఆర్డబ్ల్యుఎస్)నాబార్డ్ సలహాదారు తోట ప్రభాకరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. తాగునీటి కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాలను ముందుగా గుర్తించి నీటి ఎద్దడి లేకుండా తగిన ఏర్పాట్లు గావించాలని సూచించారు. నీటి సంరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని నీటి కొరత ఉన్న ప్రాంతాలను 'మ్యాపింగ్ చేయాలని సూచించారు. త్రాగునీటి సరఫరాపై రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రత్యేక 'వాటర్ వార్ రూమ్'లు ఏర్పాటు చేసి రోజూ నీటి సరఫరా వ్యవస్థను పర్యవేక్షించాలన్నారు. వర్షపు నీటిని వృథా చేయకుండా



ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు వివరిస్తున్న ప్రభాకరరావు

'వర్షపు నీటి సేకరణ' పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రతి నీటి బొట్టూ నిల్వ చేసేందుకు 'ఇంటింటికీ' కమ్యూనిటీ భవనాలకు 'వర్షపు నీటి హార్వెస్టింగ్' సిస్టమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా నీటి వనరులు అభివృద్ధి అవుతాయని పేర్కొన్నారు. నీటి పరిరక్షణపై పాఠశాల, కాలేజీ విద్యార్థులతో అవగాహన ప్రదర్శనలు చేపట్టాలన్నారు. వేసవి కాలంలో నీటి పొదుపు గురించి విద్యార్థుల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, "తాగునీటి వినియోగం' వేసవినీటి ఎద్దడి-నివారణ 'వాటర్ హార్వెస్టింగ్ 'అంశాలపై అన్ని రంగాల విద్యార్థులకు 'ఇంటర్న్‌షిప్' ప్రాజెక్టులు చేయించాలన్నారు. తీవ్ర నీటి ఎద్దడికి గురయ్యే ప్రాంతాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రజలకు నీటి పొదుపుపై ముందస్తు అవగాహన కల్పించి, ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేపట్టాలని సూచించారు. ఈ కాలంలో ప్రతి పట్టణం, ప్రతి గ్రామం, ప్రతి ఇంటికి నీరు అందేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ప్రతి గ్రామానికి సమగ్ర తాగునీటి సరఫరా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. తద్వారా నీటి సమస్యను అధిగమించవచ్చని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా మారిన రోడ్డు మలుపు

ప్రమాదకరంగా రోడ్డు మలుపు

చెట్లు పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని వైనం

ప్రజాశక్తి-పామూరు

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ చెరువు కట్ట వద్ద రోడ్డు మలుపు ప్రమాదకరంగా మారింది. ఆదమరిచి వాహనం నడిపితే ప్రాణాలు గాల్లో కలవడం తప్పదని వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పామూరు నుంచి కనిగిరికి నిత్యం వాహనాలు వస్తూ పోతుంటాయి. ఆర్టీసీ బస్టాండ్ అలుగు వద్ద చెట్లు అధికంగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరికి వచ్చేంతవరకు కనపడటం లేదు. ప్రమాదం జరిగిన తర్వాత అధికారులు హడావుడిగా చెట్లు తొలగించడం చేస్తారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి హైవే రోడ్డు వరకు రోడ్డుకి ఇరువైపులా చిన్న చెట్లు అల్లుకుపోయినా ఆర్అండ్‌బీ అధికారులకు పట్టలేదు. ప్రమాదాన్ని ముందే పసిగట్టి చెట్లను తొలగించి ప్రాణాయాప్రాయం జరగకుండా చూడాలని వాహనదారులు అంటున్నారు. అధికారులు స్పందించి చెట్లు తొలగించి వాహనదారులకు ప్రమాదం లేకుండా చూడాలని కోరుతున్నారు.

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

నాణ్యత పేరుతో తిరస్కరించకూడదు

కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

ప్రజాశక్తి-ఇంకొల్లు

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, నాణ్యత పేరుతో చెక్కులను వెనక్కి పంపించవద్దని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు అన్నారు. ఇంకొల్లులో ఆదివారం రాత్రి గొల్లపాలెం రోడ్డులోని యుటిఎఫ్ కార్యాలయం వద్ద పొగాకు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొగాకు కొనుగోలు కంపెనీలు ఇచ్చిన మాట ప్రకారం కాకుండా దళారులను గ్రామాలలో దింపి ఒకటి, రెండు దఫలలో కొట్టిన ఆకు కొనుగోలు చేయకుండా, నాణ్యమైన పైకొట్టుడు ఆకులు కొనుగోలు చేయుటకు ఆసక్తి చూపుతున్నారని రైతులు తెలిపినట్లు చెప్పారు. ఆ విధంగా పండిన పంటలో సగం ఆకు కూడా రైతు అమ్ముకోలేదని అన్నారు. ఆంక్షలు లేకుండా అన్ని గ్రేడ్ల ఆకు సమానమైన ధర ఇచ్చి రైతుకు గిట్టుబాటు అయ్యేలా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు వలేటి కృష్ణయ్య మాట్లాడుతూ కంపెనీలు

రైతులతో మాట్లాడుతున్న హరిబాబు

రైతులను మభ్యపెట్టి పొగాకు కొనుగోలు చేయకుండా ఆంక్షలు విధిస్తూ మాయ చేస్తే మళ్లీ రైతు పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. రైతులకు కౌలు రైతులకు బాసటగా నిలబడి, ప్రభుత్వం మరియు పొగాకు కంపెనీల మెడలు వంచి కొనుగోలు చేస్తామని హెచ్చరించారు. అందుకు రైతులందరూ పోరాటానికి సంసిద్ధంగా ఉండాలని అన్నారు. ప్రపంచ మార్కెట్లో పొగాకు మంచి డిమాండ్ ఉన్నప్పటికీ కంపెనీలు ఆశ్చర్యం చేస్తూ 10 రకాల ఆక్షేపణలు గ్రేడ్ల పేరు చెప్పి పొగాకు కొనుగోలుకు మొఖం చాటేస్తున్నాయన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా పండిన నల్లబెల్లి పొగాకు పంటతోపాటు కూడా పూర్తిగా కంపెనీలు కొనుగోలు చేయాలని అన్నారు. అందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వం తక్షణం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల రామ్ కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ పొగాకు కొనుగోలు చేయకపోవడం వలన అనేక గ్రామాలలో పొగాకు ఆరుబయట నిల్వ చేశారని, పొలాలలో గృహాల ముందు ఆరుబయట నిల్వలు పేరుకుపోయి ప్లాస్టిక్ పట్టలతో కప్పి కాపాడుకుంటున్నారని తెలిపారు. నెలలు గడిచే కొంది పొగాకు నాణ్యత తగ్గుతుందని, ప్రభుత్వం వెంటనే పొగాకు కంపెనీలపై ఒత్తిడి తెచ్చి పొగాకు అన్ని రకాలు కొనుగోలు చేసేలా తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంకొల్లు మండలంలోని పలు గ్రామాల రైతులతో పాటు నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రం, పంగులూరు మండలంకు చెందిన పలు గ్రామాల పొగాకు సాగుచేసిన రైతులు పాల్గొన్నారు.

గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న బూచేపల్లి

గృహ ప్రవేశ వేడుకల్లో బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి: దర్శికి చెందిన జంబో జిరాక్స్ ప్రొప్రైటర్ సిద్ది కోటిరెడ్డి అన్న సుబ్బారెడ్డి నూతన గృహప్రవేశం ఒంగోలు సమీపాన పేర్నమిట్టలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు పాల్గొని కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. ఆయన వెంట సుబ్బారెడ్డి బంధువులు, సహచరులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలుకు కదిలిన ప్రభుత్వం.!

ప్రజాశక్తి - ఇంకొల్లు

గత రెండు నెలలుగా రైతు, కౌలు రైతు సంఘాలు పర్చూరు, అద్దంకి, పత్తిపాడు నియోజకవర్గంతో పాటు ఒంగోలు జిల్లాలో చేసిన రైతు ఉద్యమాలు, రాస్తారోకోలు ఫలించాయి. ఎట్టకేలకు పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం కదిలింది. అత్యధికంగా పొగాకు సాగు చేసిన పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల తరఫున పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు, గత నెల 6న వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు, పొగాకు బోర్డు అధికారులు, పొగాకు కంపెనీలు, రైతు సంఘాల నాయకులు రైతులతో ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం హాల్లో సమావేశం నిర్వహించారు. పొగాకు కొనుగోలుపై చర్చించారు. నల్లబర్లీ పొగాకు కొనుగోలుకు కంపెనీలు ముందుకు రాకుండా రైతులను గత రెండు నెలలుగా పొగాకు కొట్టుడుకు వచ్చినప్పటి నుంచి ఏడిపిస్తూ ఉన్నాయి. దీంతో నల్లబర్లి పొగాకు చేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందారు. పొగాకు కొట్టిన కూలీలకు డబ్బులు ఇవ్వలేని పరిస్థితిల్లో కౌలు రైతులు ఉన్నారు. రైతుల పరిస్థితి గమనించి ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రాంతీయ రైతు సంఘాలు, రాష్ట్ర రైతు సంఘాల నాయకులు అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో వివిధ ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో రైతుల పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. నల్లబర్లీ పొగాకు రైతులకు బాసటగా నిలిచారు. రైతులతో గ్రామాల వారిగా సమావేశాలు

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు (ఫైల్‌ఫోటో)

నిర్వహించారు. కరపత్రాల పంపిణీ చేశారు. రాస్తా రాకోలు పర్చూరు, ఇంకొల్లు, నాగులుప్పలపాడు ప్రాంతాల్లో నిర్వహించారు. గత నెలలో కలెక్టర్ దృష్టికి పొగాకు కొనుగోలు సమస్య తీసుకపోయారు. ఈ ప్రాంత నాయకులైన మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకుపోయారు. కంపెనీలతో కలెక్టర్ మాట్లాడిన దిగి రాలేదు. కొనుగోలుకు ముందుకు రాలేదు. సాకులు చెబుతూ రైతుల వద్ద ఉన్న పొగాకు కారు చౌకగా కొట్టేయాలని పన్నాగం పన్ని సిండికేట్ అయ్యారు. ఎప్పటికప్పుడు పరిస్థితి గమనిస్తున్న రైతు, కౌలు రైతు సంఘం నాయకులు తప్పనిసరి పరిస్థితుల్లో ఇంకొల్లు, పర్చూరులో గత నెల ఆఖరున పొగాకు రైతులతో సదస్సు నిర్వహించారు. పొగాకు బహుళ జాతి కంపెనీల చేత ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పొగాకు రైతుల సమస్య తీరటానికి ఉద్యమాలు ఉధృతం చేస్తామని సదస్సులో నాయకులు హెచ్చరించారు. ఏదేమైనప్పటికీ రైతు సంఘాల పోరాటంతో పాటు శాసన సభ్యులు ఏలూరి, మంత్రుల కృషి పొగాకు బోర్డు అధికారుల చొరవతో పొగాకు కంపెనీలతో కొనుగోలు చేయిస్తామని, కొనుగోలు చేయాలని ఆదేశాలు శనివారం ప్రభుత్వపరంగా అధికారికంగా జారీ చేశారు. ఎపి అగ్రికల్చర్ డైరెక్టర్ ఐఎఎస్ ఢిల్లీరావు ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలుకు సంబంధించి కంపెనీలపై ప్రతిరోజూ పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఇందుకు సంబంధించి కంట్రోల్ రూం రైతులకు అందుబాటులో ఏర్పాటు చేస్తున్నట్లు ఆదేశాలలో వివరించారు.

గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి

నల్లభరిల్లి పొగాకు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని, పొగాకు నాణ్యతపై సాకులతో కంపెనీలు ఆంక్షలు విధించకుండ రైతులు తెచ్చిన పొగాకు చెక్కులు కంపెనీలు వెనక్కి వేయకుండా, ఇబ్బంది పెట్టకుండా కొనుగోలు చేయాలని రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు కోరారు. తెల్లబర్లి పొగాకు కొన్ని చెక్కులు నాణ్యత పేరుతో కంపెనీలు వెనక్కి పంపిస్తున్నాయని, నల్లబర్లీ తోపాటు తెల్ల బర్లీ కూడా ఆంక్షలు లేకుండా రైతుకు గిట్టుబాటు అయ్యే ధరకు కొనుగోలు చేయాలని కోరారు. కష్టకాలంలో రైతులు, కౌలు రైతులను ప్రభుత్వంతోపాటు కంపెనీలు ఆదుకోవాలని అన్నారు.

మద్యం షాపు సిట్టింగు వద్దని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

'మద్యం షాపు' సిట్టింగులు ఆపాలి

ప్రజాశక్తి -కారంచేడు

మండలంలోని స్వర్ణ గ్రామంలో పెట్రోల్ బంకు సమీపంలో ప్రభుత్వం నూతనంగా మద్యం షాపు ఏర్పాటు చేస్తుందని. ఆ షాపుకు అనుబంధంగా సిట్టింగ్ పెట్టి మద్యం అక్కడే త్రాగడానికి ఏర్పాటు చేస్తున్నారని, అందుకు నిరసనగా స్థానికులు గ్రామంలోని ఉన్నత పాఠశాల నుంచి ఉత్తర బజార్ వరకు ఆందోళన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా స్థానిక సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో పలువురు అభ్యుదయవాదులు మాట్లాడారు. మద్యం షాపులోనే త్రాగడానికి ఏర్పాట్లు చేస్తున్నారని ఆందోళన కారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తక్షణం నూతన మద్యం షాపు వద్ద సిట్టింగ్ ఏర్పాట్లను ఆపివేయాలని డిమాండ్ చేశారు. లేనిచో భవిష్యత్తులో ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. గ్రామంలోని స్వర్ణ సేవా సమితి, సిపిఎం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు

డీఎస్సీ పరీక్షల గడువు పెంచాలి

ప్రజాశక్తి - కర్లపాలెం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డిఎస్సీ కోసం చేసిన తన తొలి సంతకం చేసిన 11 నెలల తర్వాత డిఎస్సీ ప్రకటించడం పట్ల ఉపాధ్యాయ అభ్యర్థులు సంతృప్తికరంగా లేరని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానికంగా ఓ ఉపాధ్యాయుడి ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. మూడు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. డీఎస్సీకి హాజరయ్యే అభ్యర్థులకు కేవలం 45రోజులు గడువు ఇచ్చారని, ఈ 45 రోజులు సిలబస్ ఒకసారి కూడా అటు నుండి ఇటు తిప్పటానికి సరిపోదని అన్నారు. దీన్ని 90 రోజులకు పెంచాలని అభ్యర్థులు ఏకగ్రీవంగా కోరుతున్నారని అన్నారు. 2018 డీఎస్సీ నాటికి అభ్యర్థులకు వయోపరిమితి 44ఏళ్ళు ఇచ్చారని, తిరిగి ఏడేళ్లుగా డీఎస్సీ లేకపోవడంతో అనేక మందికి వయోపరిమితి మించి పోతున్న నేపథ్యంలో అభ్యర్థుల వయస్సు 47 ఏళ్లకు పెంచాలని కోరారు. డీఎస్సీ అభ్యర్థుల వయోపరిమితి పెంచినందువల్ల అదనంగా కొంత మంది అభ్యర్థులు మాత్రమే రాయడానికి అవకాశాలు ఉంటాయని అన్నారు. డిగ్రీలో 50శాతం మార్కులు ఉండాలని పెట్టారని, వాళ్లంతా టెట్ క్వాలిఫై అయి బీఈడి చేశారని, ఆరోజులేని నిబంధన ఇప్పుడు ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. అందుకని డిగ్రీ మార్కుల పరిమితి తీసేసి టెట్ క్వాలిఫై అయితే ఈ పరీక్షకు అనుమతించాలని కోరారు. ఈ మూడు అంశాలపై గత వారం రోజులుగా ఎక్కడికి వెళ్లినా అభ్యర్థులు పెద్ద ఎత్తున తమ దృష్టికి తెస్తున్నారని అన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఈ అంశాలపై దృష్టి పెట్టాలని నిరుద్యోగ అభ్యర్థుల తరుపున డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ఏమి చేయాలనే అంశాలపై అనేక సలహాలు, సూచనలను ప్రభుత్వం దృష్టికి తెచ్చామని అన్నారు. ఒకటి నుండి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించి మార్కుల పర్సంటేజ్ ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కాపాడుకోవాలంటే చాలా రకాల ప్రతిపాదనలు చేస్తేనే ప్రభుత్వ పాఠశాలల మనగడ కొనసాగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జడ వినయ్ కుమార్, అడుగుల శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి ఎం వెంకటేశ్వరరెడ్డి, కర్లపాలెం యూటీఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి నారాయణ, జన విజ్ఞాన వేదిక నాయకులు వై భాస్కరరావు పాల్గొన్నారు.

ఈదురు గాలులు, వడగండ్ల బీభత్సం

- పలు చోట్ల వడగండ్ల వాన బీభత్సం
- రోడ్లపై పడిన చెట్లు, హోర్డింగులు
- పిడుగు పడి ఒండు ఎద్దులు మృతి

ప్రజాశక్తి - చీరాల

చీరాలలో ఆదివారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షంతోపాటు మేరీ క్రిస్టియన్ పేటలో వడగండ్ల వాన కురిసింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులుతో వర్షం భారీగా కురవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మరోపక్క భారీ గాలుల తీవ్రతకు చెట్లు, హోర్డింగులు, ఇంటి పైకప్పులు ఊడి నేలమట్టం అయ్యాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రోడ్లపై పడిన హోర్డింగులతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇక రోడ్లపై నిలిపిన బైకులు, కార్లు, ఆటోలు కిందపడి మరమ్మత్తులకు గురైయ్యాయి. మండలంంలోని కొత్తపాలెంలో పిట్టు పోతురాజు ఇంటి వద్ద కట్టేసిన రెండు ఎద్దులపై పిడుగు పడి మృతి చెందాయి. ఐక్యనగర్‌లో పిడుగు పాటుకు ఓ మహిళకు గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఏరియా వైద్యశాలకు తరలించారు. గడియార స్తంభం సెంటర్, రైల్వే స్టేషన్ రోడ్డు, మున్సిపాలిటీ, కొత్తపేట, విఠల్ నగర్, పేరాల, కొత్తపేట వడ్డే సంఘంలో భారీ గాలులకు ప్రజల ఇళ్లల్లోకి పరుగులు తీశారు. చీరాల ముక్కోన పార్క్ సెంటర్ వద్ద ఓ భారీ హోర్డింగ్ ఆటోపై పడడంతో ఆటో ధ్వంసమైంది. ఆటో యజమాని లబోదిబోమంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

చీరాల గడియార స్తంభం సెంటర్లో పడిన పోలీస్ షెల్టర్

బాపట్ల : ఆకస్మికంగా వాతావరణంలో ఏర్పడే మార్పులతో ఉరుములు, మెరుపులు ధాటికి ఎక్కడ పిడుగు పడుతుందోననే భయంతో ప్రజలు భీతిల్లుతున్నారు. ఆదివారం ఉదయం వరకు సెగరేపిన ఎండతో వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన మార్పులు, అకాల వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. పిడుగుల ప్రభావం జిల్లాను కురిపేసింది. ఆదివారం ఈదురు గాలులు ఈడ్చి కొట్టిన వర్షం ధాటికి జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. ఒక్కసారిగా మేఘాలలో వచ్చే మార్పులు, ఈదురు గాలులతో కూడిన వర్షం పడే సమయంలో పిడుగులు పడే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. బాపట్లలో భారత వాతావరణ పరిశీలన శాల ఎప్పటికప్పుడు ఈ సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తోందన్నారు. 27రకాల మేఘాల పనితీరును పసిగట్టేందుకు ఈ కేంద్రం అధునాతన సామర్థ్యం కలిగి ఉందని వాతావరణ కేంద్రం ప్రతినిధి తెలిపారు. మే నెలలో అధికంగా పిడుగులు పడే అవకాశం ఉందని అన్నారు. ఈ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు.

కొల్లూరు : మండలంలోని తోకలవానిపాలెం పంచాయతీలో ఆదివారం కురిసిన అకాల భారీ వర్షం, బలమైన ఈదురు గాలులకు పెద్ద, పెద్ద చెట్లు, కరెంటు స్తంభాలు విరిగి రోడ్లపై పడ్డాయి. దీంతో ప్రజలకు, వాహన దారులకు ఇబ్బంది లేకుండా జెసిబితో చెట్లను సర్పంచి టి కృష్ణమోహన్ తొలగించే పనులు చేపట్టారు.

కొల్లూరులో చెట్లు తొలగింపు చేయిస్తున్న కృష్ణమోహన్

పిడుగు పడి పగిలిన నీళ్ల ట్యాంకు

ప్రజాశక్తి - కారంచేడు

పిడుగు పడి స్వర్ణ గ్రామంలో ఓ ఇంటి మీద ఉన్న నీళ్ళ ట్యాంకు పగిలిపోయింది. మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన నీరు కట్టు దయా శేఖర్ ఇంటిపై ఆదివారం మధ్యాహ్నం ఇంటిపై ఉన్న నీళ్ల ట్యాంక్ మీద పిడుగు పడింది. ఆదివారం ఉదయం నుంచి ఒకసారిగా వాతావరణం మారిపోయి మేఘావృతమైంది. దీంతో ఉరుములు మెరుపులతో వర్ష సూచన కనిపించడంతో అదే సమయంలో వర్షం పెద్దగా పడకపోయినా తీవ్రమైన గాలులు వీచి ఉరుములు మెరుపులతో ఒకసారి పడిగులు పడ్డాయి. పగిలిపోయిన ట్యాంకు శఖలాలు ఇంటికి దూరంగా విసురుగా పడ్డాయి. దీంతో ఒకసారిగా ఇంటి యజమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఏమి జరిగిందో తెలియకపోవడంతో కొద్దిసేపటికి మెడపైకి వెళ్లి చూడగా తమ ట్యాంకు పగిలిపోయి ఉండటంతో దూరంగా ఎక్కడో పడిందనుకున్న పిడుగు తమ ఇంటిపైనే పడిందని తెలుసుకొని ఆశ్చర్యం, భయానికి లోనయ్యారు.

స్వర్ణ గ్రామంలో ఇంటిపై పగిలిన నీటి ట్యాంకు

బైకుపై వెళుతూ మృతి చెందిన సుప్రదీప్ (25)

పిడుగు పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొల్లూరు

బైక్ నడుపుతున్న వ్యక్తులపై పిడుగు పడి మృతి చెందిన సంఘటన మండలంలోని గాజులంక క్వారీ దగ్గర ఆదివారం జరిగినది. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం ఆదివారం మధ్యాహ్నం 2గంటల సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తుండగా కృష్ణా జిల్లా కోసూరు నుండి గుంటూరు జిల్లా వైపు బండిపై ఇద్దరు వ్యక్తులు వస్తుండగా గాజులు లంక దగ్గరకు రాగానే వారిపై పిడుగు పడినది. బండి నడుపుతున్న సుప్రదీప్ (25) మృతి చెందగా వెనుక కూర్చున్న పాగోలు అనిల్ అనే వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నది. అతన్ని వెంటనే స్థానికంగా ఉన్న పీహెచ్‌సికి తరలించి చికిత్స చేస్తున్నారు.

20న సమ్మెను జయప్రదం చేయండి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-చీమకుర్తి

ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయడం ద్వారానే కార్మిక చట్టాలను నిలబెట్టుకోగలమని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక పంగులూరి కష్ణయ్య భవనంలో ఆదివారం జరిగిన సిఐటియు సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే పనిలో వేగంగా పావులు కదుపుతోందన్నారు. కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మిక కోడ్‌లను రాష్ట్రాలు అమలుచేసేలా ఒత్తిడి తెస్తోందన్నారు. వారి ప్రయత్నాలను సమ్మె ద్వారా తిప్పికొట్టాలని చెప్పారు. దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి.. కార్మికవర్గ ఐక్య పోరాటాలను, ఐక్యతను దెబ్బకొట్టే చర్యలు చేపడుతోందన్నారు. కార్మిక వర్గం చైతన్యంతో ఈ దుష్ట పన్నాగాన్ని తిప్పికొట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ మాట్లాడుతూ కార్మిక వర్గం రోజువారీ సమస్యలపై తీవ్ర ఆందోళన చెందుతోందన్నారు. ఈ సమ్మెలో కార్మికులందరినీ భాగస్వామ్యం చేయాలన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ ఐదు రోజుల నుంచి సమ్మె చేస్తున్న విలేజి క్లినిక్ లో పనిచేస్తున్న సిహెచ్‌ఓల పోరాటానికి సిఐటియు మద్దతిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించారు. ప్రభుత్వం వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని సమావేశం డిమాండ్ చేసింది. కార్యక్రమంలో జిల్లా ఆఫీస్ బ్యారర్లు పి.కల్పన, పి.ఆంజనేయులు, బంకా సుబ్బారావు, పారా శ్రీనివాసరావు, టి మహేష్, జీవీ.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, ఈదర అన్నపూర్ణ, రాఘవమ్మ, మాల్యాద్రి పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్ పరీక్షలు

- అభ్యర్థులను తనిఖీ చేసిన అధికారులు
- 1428 మంది అభ్యర్థులు హాజరు
- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

ఏర్పాట్లపై ఆర్డీవో లక్ష్మీప్రసన్నతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ఆదివారం జరిగిన నీట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఒంగోలులోని డిఆర్ఆర్ఎం మున్సిపల్ హై స్కూల్, జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయము, దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలో ఈ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించారు. పరీక్షలకు మొత్తం 1473 మంది అభ్యర్థులకుగాను 1428 మంది హాజరు కాగా 45 మంది గైర్హాజరయ్యారు. ఒంగోలు డిఎ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మొత్తం 336 మందిని కేటాయించగా 325 మంది అభ్యర్థులు హాజరు కాగా 11 మంది గైర్హాజరయ్యారు. డిఆర్ఆర్ మున్సిపల్ హైస్కూలుకు మొత్తం 177 మందిని కేటాయించగా 171 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. కేంద్రీయ విద్యాలయకు మొత్తం 432 మందిని కేటాయించగా 421 మంది హాజరు కాగా 11 మంది గైర్హాజరయ్యారు. డిఎ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు మొత్తం 288 మందిని కేటాయించగా 276 మంది అభ్యర్థులు హాజరు కాగా 12 మంది గైర్హాజరయ్యారు. జవహర్ నవోదయ విద్యాలయకు మొత్తం 240 మందిని కేటాయించగా 235 మంది అభ్యర్థులు హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలకు మొత్తం 1473 మంది అభ్యర్థులకుగాను 1428 మంది హాజరు కాగా 45 మంది గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ సిటీ కోఆర్డినేటర్ మనీష్ తెలిపారు. పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు, భద్రతాపరమైన చర్యలు చేపట్టారు. డిఆర్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో నీట్ పరీక్షలను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తనిఖీ చేసి సదుపాయాలు, చెకింగ్, భద్రతా ఏర్పాట్లపై సంతప్తి వ్యక్తం చేశారు. పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లను ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఇతర అధికారులు పర్యవేక్షించారు.

భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన ఎస్‌పి

నీట్ (యుజి)2025 పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ పరిశీలించారు. ఒంగోలు నగరంలోని ఐదు పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్‌పి బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నీట్ పరీక్ష ప్రశాంతంగా, సజావుగా జరపటానికి అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు ముగిశాక ఆ పత్రాలు పటిష్ట భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్స్‌కు తరలిస్తామన్నారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు ఉన్నట్లు తెలిస్తే వెంటనే అదుపులోకి తీసుకొని విచారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ఎస్‌పి వెంట ఏ ఆర్ అదనపు ఎస్‌పి అశోక్ బాబు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ కెవి రాఘవేంద్ర, ఒంగోలు వన్‌టౌన్ సిఐ నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

సదస్సులో పాల్గొన్న నాయకులు

మైదాన గిరిజన కులాలకు ప్రాతినిధ్యమేదీ?

- వారి సమస్యలు ఎవరికీ పట్టవా.?
- మైదాన ప్రాంత గిరిజన సదస్సులో గళమెత్తిన నేతలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

గిరిజనులకు చట్టపరంగా ఇవ్వాల్సిన రిజర్వేషన్లు కల్పిస్తున్నా... కొన్ని కులాలకు అసలు రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా పోతోందని పలువురు నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో మైదానప్రాంత గిరిజన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, బిఎస్‌పి రాష్ట్ర సమన్వయకర్త, మాజీ డిజిపి జె.పూర్ణచంద్రరావు, మరో సమన్వయకర్త బక్కా పరంజ్యోతి మాట్లాడారు. మాజీ డిజిపి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, "జగన్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన ప్రకారం రాష్ట్రంలో మొత్తం జనాభా 4.32 కోట్లు, అందులో ఎస్‌టిలు 25,34,795 ఉన్నారన్నారు. మొత్తం జనాభాలో వారిది 5.86 శాతం కాగా 2011లో కేంద్రం నిర్వహించిన జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా రూ.4.94 కోట్లు ఉన్నారన్నారు. నేషనల్ కమిషన్ టెక్నికల్ గ్రూప్ ఆన్ పాపులేషన్ ప్రొజెక్షన్ ప్రకారం రాష్ట్ర జనాభా (10.02.2025 ఫిబ్రవరి 10 నాటికి) 5.35 కోట్లు కాగా ఎస్‌టిలలో ప్రధానంగా యానాదులు, ఎరుకలు, సుగాలీలు, చెంచులు, కమ్మర్లు, కొండదొరలు, కోయలు, జాతాపులు, కోర్లు, సవర్లు, కొండ రెడ్లు, బగతలు చాలా మంది ఉన్నారన్నారు. వీరందరికీ సమానమైన ప్రాతినిధ్యం లేదని, రాష్ట్రంలో కమ్మ, రెడ్ల రాజకీయం ఎక్కువగా నడుస్తోందన్నారు. రిజర్వేషన్ల ప్రకారం ఇవ్వాల్సిన ఏడు అసెంబ్లీ సీట్లను ఏజెన్సీ ప్రాంతంలో సర్దేస్తున్నారని, మైదాన ప్రాంత గిరిజనులకు అవకాశం అస్సలు దక్కడం లేదన్నారు. రాయలసీమ, కష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల్లోని మైదాన ప్రాంతంలో ఎస్‌టిలకు అస్సలు ఎస్‌టి నియోజకవర్గాలు ఏర్పాటు చేయడం లేదన్నారు. ఎస్‌టిలలో అత్యధికంగా యానాది కులస్తులు సుమారు 5 లక్షలు ఉన్నారని, తర్వాత వరుసగా ఎరుకలు, సుగాలీలు, కొండదొరలు, కోయలు, జాతాపులు, కోదులు, సవరలు, కొండరెడ్లు ఉన్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 115 మంది ఎస్‌టిలు ఎమ్మెల్యేలయ్యారు. ఇప్పటివరకు ప్రాతినిధ్యం లేని కులాలకు తప్పనిసరిగా ప్రాతినిధ్యం ఉంటేనే వారి సమస్యలపై అసెంబ్లీలో చర్చించే అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఎమ్మెల్సీ కుంభా రవిబాబు మాట్లాడుతూ త్వరలో జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)లోనైనా మైదాన ప్రాంత గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. వారికి కనీసం మూడు నాలుగు స్థానాలు కేటాయించాలన్నారు. మైదాన ప్రాంత గిరిజనుల కోసం ఏర్పాటుచేసిన కార్పొరేషన్ కూడా నామమాత్రంగానే ఉంటోందని, నిధులు ఇవ్వడం లేదన్నారు. ప్రతి జిల్లాలోనూ ఐటీడీఏ ఏర్పాటుచేసి, బ్యాంకులతో సంబంధం లేకుండా గిరిజనుల్లో మైదాన ప్రాంతంలో ఉండేవారిని సమాజంలో పైకి తీసుకురావాలన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కారం కావాలంటే రాజకీయ ప్రాతినిధ్యం ఉండాలని తెలియజేశారు. సమావేశంలో ఎస్‌టి నాయకుడు పేరం సత్యం, బిఎస్‌పి రాష్ట్ర సమన్వయకర్త పరంజ్యోతి ప్రసంగించారు.

కాపు రాక.. ధర లేక..

- ఇబ్బందులు పడుతున్న బత్తాయి రైతులు
- అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతన్నలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

బత్తాయి అంటేనే ప్రధానంగా గుర్తొచ్చేది ప్రకాశం జిల్లా .అందులో పశ్చిమ ప్రాంతం. ఇక్కడ బత్తాయి ఎక్కువగా పండించే ప్రాంతమైనా రైతుల సమస్యలు పరిష్కరించే నాధుడే కన్పించడం లేదు. పూటకొక రేటుతో సాగుదారులు బక్క చిక్కిపోతున్నారు. పంటకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. మార్కెట్ సౌకర్యం కలగా మిగిలిపోతుండటంతో పెట్టుబడులు కూడా దక్కడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఈ ఏడాది బత్తాయి రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారు. సకాలంలో వర్షాలు కురవక ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక బత్తాయి రైతులు విలవిలలాడుతున్నారు. గత వారం రోజుల వరకూ టన్ను బత్తాయి కాయల ధర రూ.25 వేలు పలికింది. అంతలోనే మార్కెట్లో బత్తాయి ధర తగ్గిందని స్థానిక బ్రోకర్లు ధరను అమాంతంగా తగ్గించారు. ప్రస్తుతం టన్ను బత్తాయి కాయలను కేవలం రూ.15 వేలు నుంచి రూ18 వేలు వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది ఇదే సీజన్‌లో టన్ను బత్తాయి కాయలు రూ.40 వేలు పలికాయి. ఈ ఏడాది ధర పూర్తిగా తగ్గిపోయింది. దీంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు.

జిల్లా వ్యాప్తంగా.

జిల్లా వ్యాప్తంగా గత ఏడేండ్ల క్రితం వరకూ 20,291 హెక్టార్లలో బత్తాయి తోటలు సాగులో ఉండగా అందులో మార్కాపురం డివిజన్లోనే 11,932 హెక్టార్ల తోటలు సాగులో ఉన్నాయి. ఐతే గత ఐదేండ్ల నుండి వస్తున్న అననుకాల పరిస్థితుల నేపద్యంలో సకాలంలో వర్షాలు కురవక జిల్లా వ్యాప్తంగా 11,707 హెక్టార్లలోని బత్తాయి తోటలను నిలువునా నరికేశారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 7027 ఎకరాల్లోబత్తాయి తోటలు సాగులో ఉండగా అందులో యర్రగొండపాలెం నియోజకవర్గంలో 1925 ఎకరాల్లో బత్తాయి తోటలు సాగులో ఉన్నాయి. ప్రస్తుతం తోటల్లో సీజన్ కాపు కాసింది.

పశ్చిమ ప్రాంత బత్తాయికి భలే గిరాకీ..

ఈప్రాంతలో పండిన బత్తాయి కాయలను ఇక్కడ నుండి డిల్లీ, కలకత్తా, హైదరాబాద్, రాజస్తాన్, కర్నాటక, విజయవాడ, పాట్నా తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. రోజుకు ప్రస్థుతం 15 నుండి 20 లారీల మేరకు ఆయా ప్రాంతాలకు బత్తాయి కాయలను ఎగుమతి చేస్తున్నారు.

కాపు రాక.. ధర పతనమై..

సరైన వర్షాలు కురవకపోవడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటడంతో కాపు ప్రారంభానికి ముందే తోటలన్నీ బెట్టకొచ్చాయి. పూతా పిందె రాలిపోయాయి. అధిక శ్రమ కోర్చి వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి అదనపు బోర్లు వేయించుకున్నారు. అయినా వాటిలో కూడా నీళ్ళు పడక తీవ్రంగా నష్టపోయారు. మరి కొందరు ట్యాంకరుకు రూ. 800 చొప్పున ఖర్చు చేసి నీటికి తెప్పించుకొని, ఇలా వారోనికోసారి నీటి తడులు పెడుతూ తోటలను కాపాడుకున్నారు. అయినా దిగుబడి బాగా తగ్గింది.

మార్కెట్ ఎండమావేనా.?

యర్రగొండపాలెం, కనిగిరి, లాంటి ప్రాంతాల్లో గతంలో ప్రభుత్వం, పాలకులు బత్తాయి మార్కెట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినా ఇంత వరకు హామీ అమలు కాలేదు. దీంతో పాటు యర్రగొండపాలెం గానీ కనిగిరిలో గానీ బత్తాయి మార్కెట్‌తో పాటు జ్యూస్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని గత పాలకులు తెలిపారు. కానీ పట్టించుకోలేదు. దీనికి తోడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఈ ప్రభుత్వం కూడా ఇంత వరకు పట్టించుకోలేదు. మార్కెట్ సౌకర్యం లేనందు వల్ల రవాణా చార్జీలు, కూలీల ఖర్చులు కలుపుకోని ఏటా రూ. 100 కోట్ల వరకు నష్టపోతున్నారు.

బత్తాయిని నేరుగా కొనాలి

అన్నపురెడ్డి అంజిరెడ్డి, రైతు, గంజివారిపల్లి

బత్తాయి పంటను దళారుల ప్రమేయం లేకుండా నేరుగా కొనుగోలు చేయాలి. అప్పుడే రైతులకు గిట్టుబాటు ధర వస్తోంది. మార్కెట్ యార్డులో గిడ్డంగులను ఏర్పాటు చేస్తే ధర లేని సమయంలో పంటను అందులో దాచుకోవచ్చు. ఇవన్నీ లేని కారణంగా ఆరు ఎకరాల్లో బత్తాయిని సాగు చేసి నష్టపోయా..

ఈదురుగాలుల బీభత్సంతో విరిగిన చెట్లు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు పంచాయతీ పరిధిలో ఆదివారం అకాల భారీ వర్షం, బలమైన ఈదురు గాలులకు బస్టాండ్ నుండి వెల్లటూరు వెళ్లే రోడ్డు, మురుగు కాలవ బ్రిడ్జి వరకు రోడ్డుకు విరువైపులా పెద్ద, పెద్ద చెట్లు విరిగి రోడ్డుమీద పడిపోయాయి. దీంతో ప్రజలు, ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా జెసిబితో చెట్లను సర్పంచ్ ధారా రవికిరణ్మయి, పంచాయతీ కార్యదర్శి కోటా శ్రీనివాసరావు, ఎస్ఐ ఎం శివయ్య ఆధ్వర్యంలో యువకుల సహకారంతో యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. మధ్యాహ్నం 12 గంటల వరకు తీవ్రమైన ఎండ వేడిమితో అల్లాడిన ప్రజలకు ఒకసారిగా ఆకాశం మేఘావృతమై బలమైన ఈదురు గాలులతో కూడిన ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

పడిపోయిన చెట్లను తొలగిస్తున్న పోలీసులు, గ్రామస్తులు

కురిసింది. భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్ నుండి వెల్లటూరు రోడ్డులోని బ్రిడ్జి వరకు సుడిగాలిలా వ్యాపించి వందేళ్ళ నాటి చెట్లు సైతం విరిగి రహదారిపై పడిపోయాయి. ఈ చెట్లను తొలగించేందుకు యువకులు ముందుకు రావడంతో పోలీసులు దగ్గరుండి రహదారిపై ఉన్న చెట్లను తొలగించారు. సర్పంచ్, కార్యదర్శి జెసిబిని ఏర్పాటు చేసి చెట్లను అడ్డు లేకుండా రహదారిపై నుండి బయటకు తరలించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. రైల్వే గేటు నుండి బియ్యం డ్రైన్ వరకు పెద్ద, పెద్ద చెట్లు, విద్యుత్తు వైర్లపై పడటం, స్తంభాలతో సహా విరిగిపోయి. ఆ ప్రాంతంలో విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గృహాల మధ్య ఉన్న చెట్లు కూడా విరిగి గృహాలపై పడటంతో పలు గృహాల సిమెంటు రేకులు పగిలిపోయి దెబ్బ తిన్నాయి. విద్యుత్ సమస్యను అధికారులు తక్షణం పరిష్కరించి ఆ ప్రాంతంలో గృహాలకు విద్యుత్తు సరఫరా అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ యువకులు పాల్గొన్నారు.

తనిఖీ చేస్తున్న కలెక్టర్ జెవి మురళి, ఎస్పీ తుషార్ డూడి

నీట్ పరీక్షా కేంద్రాల్లో కలెక్టర్, ఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని వైఎ ప్రభుత్వ మహిళ కళాశాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ జె వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడి ఆదివారం పర్యవేక్షించారు. అభ్యర్థి అడ్మినిస్ట్రేషన్ విభాగాన్ని, విద్యార్థులను తనిఖీ చేసే విధానాన్ని, సీసీ కెమెరాలు అనుసంధానించిన విభాగాన్ని పరిశీలించారు. అబ్జర్వర్లు, కో ఆర్డినేటర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి విద్యార్థులకు చేసిన ఏర్పాట్ల గురించి, పరీక్ష విధానాల గురించి చర్చించారు. పరీక్ష కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లపై పోలీసు అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నీట్ పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైఎ కళాశాలలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో 416 మంది విద్యార్థులను ఎన్‌టిఎ కేటాయించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఎవరు గుంపులుగా సంచరించకుండా పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ (144 సెక్షన్) విధించి, కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని అన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులు మూసివేసేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. పరీక్ష సెంటర్ వద్ద డిఎస్‌పి, హెచ్ఎమ్‌డిలు ఏర్పాటు చేసి ప్రతి అభ్యర్థిని బీడీ టీంతో తనిఖీ చేయించారు. హాల్ టికెట్లు, ఆధ్యిట్ కార్డులు ఉన్న అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించామని అన్నారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా తగిన చర్యలు తీసుకున్నామని అన్నారు.

మొక్కజొన్న పొలం దగ్ధం అవుతున్న దృశ్యం

పొలాల్లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని తూర్పు తక్కెళ్ళపాడు పంట పొలాల్లో ఆదివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో మేడూరి కాశియ్యకు చెందిన కోత కోసిన మొక్కజొన్న కంపకు నిప్పంటుకోవడంతో చెలరేగిన మంటలు పక్కనున్న సుబాబుల్ తోటలకు ఎగబాకి దహనం చేశాయి. ఈ ప్రమాదంలో ఎనికపాటి సుందరరావు, ఎనికపాటి వెంకటేశ్వర్లు, కృష్ణకు చెందిన రెండెకరాల సుబాబుల్ తోటలు దగ్ధమవడంతో నష్టం వాటిల్లింది. ప్రమాదంలో ఆయా పొలాల్లో ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ పంప్ సెట్లకు సంబంధించిన పివిసి పైపులు, ప్యానల్ బాక్సులతో పాటు, స్ప్రింక్లర్ గొట్టాలు కాలి బూడిద అయ్యాయని రైతు తెలిపారు. కాశయ్యకు చెందిన కోతకోసిన మొక్కజొన్న పొలంలో గొర్రెలు మేపుకుంటున్న సమయంలో గొర్రెల కాపరులు అజాగ్రత్త వల్ల ఈ ప్రమాదం జరిగిందని రైతులు అనుమానిస్తున్నారు. అగ్ని ప్రమాదాన్ని గమనించిన రైతులు సమీప పొలాల్లోని వ్యవసాయ పంప్ సెట్ ద్వారా నీటిని మళ్లించి మంటలు అర్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రమాదంలో సుమారు రూ.2.50లక్షల నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు.

మృతుని కుటుంబానికి అండగా ఉంటాం : ఎంఎల్ఎ

- రూ.15 లక్షల వరకు కుటుంబానికి హామీ
- రూ. 25 వేలు తక్షణ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చీరాల

విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన విజయనగర కాలనీవాసి జడ సునీల్ కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. స్థానిక ఏరియా వైద్యశాల వద్దకు వెళ్లి సునీల్ మృతదేహానికి నివాళులర్పించి చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, ఎపి లిడ్ కార్పొరేషన్ చైర్మన్ పిల్లి మాణిక్యరావులతో కలిసి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను విద్యుత్ అధికారులను అడిగి తెలుసు కున్నారు. మట్టి ఖర్చులకు రూ.25వేల తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంటు పని చేస్తూ విద్యుత్ తీగలపై మృతి చెందిన తీరు తనను కలిచి

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

వేసిందని అన్నారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుండి అన్ని విధాల ఆదుకుంటానని అన్నారు. విధి నిర్వహణలో లైన్మెన్ మృతి చెందినప్పుడు వచ్చే ప్రభుత్వ సాయం రూ.5లక్షలు వచ్చేలా చేస్తానని తెలిపారు. చీరాల ప్రాంతంలో త్వరలో రాబోతున్న మూడు సబ్ స్టేషన్లలో మృతుని కుటుంబంలో ఒకరికి ఔట్సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. మృతుడు సునీల్‌ను పనికి తీసుకువెళ్లిన కాంట్రాక్టర్ నుండి రూ.5లక్షలు, లైన్ మెన్ నుండి రూ.5లక్షలు కలిపి రూ.15 లక్షల వరకు మృతుని కుటుంబంకు ఇచ్చేలా కాలనీ పెద్దలు, నాయకుల సమక్షంలో విద్యుత్, కాంట్రాక్టర్, లైన్‌మెన్‌లు ఒప్పందం చేసినట్లు తెలిపారు. అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వారి నుండి వచ్చిన హామీ మేరకు మృతదేహాన్ని ఏరియా వైద్యశాల నుండి తీసుకువచ్చి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. జరిగిన ఘటనపై విద్యుత్ అధికారులు, కాంట్రాక్టర్, లైన్మెన్‌పై 2వ పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు బుడంగుంట్ల లక్ష్మీ నరసయ్య, బిఎస్పి నాయకులు ఎస్ భగత్ సింగ్, గొర్రెపాటి రవి, ఎంఆర్పిఎస్ నాయకులు దుడ్డు వందనం పాల్గొన్నారు.

ప్రమాదంలో మృతి చెందిన జవానుకు నివాళి

ప్రజాశక్తి - అమృతలూరు

అమర్తలూరు గ్రామానికి చెందిన భారత సైనిక ఉద్యోగి నార్ల నరేష్ పంజాబ్‌లోని పటాన్ కోట్‌లో పనిచేస్తు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని ఆదివారం మృతుని స్వగ్రామం అమర్త లూరుకు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న శాసన సభ్యులు నక్క ఆనంద బాబు గ్రామానికి చేరు కుని జవాను నరేష్ మృత దేహానికి పూల మాల వేసి నివాళులర్పించి గౌరవ వందనం చేశారు. నరేష్ కుటుం బ సభ్యులతో మాట్లాడి మనో ధైర్యాన్ని కల్పించారు. మృతుని కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం సైనిక

నరేష్ మృత దేహానికి నివాళులర్పిస్తున్న ఆనందబాబు

లాంఛనాలతో నరేష్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన వెంట టిడిపి, నాయకులు, కార్యకర్తలు, పోలీసు, ఆర్మీ సిబ్బంది ఉన్నారు.

రెండేళ్లలో రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు, ఆలపాడు గ్రామాల మధ్య నిర్మించనున్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు రెండేళ్లలో పూర్తి చేయాలని భావిస్తున్నట్లు ఎంపీ తేన్నేటి కృష్ణ ప్రసాద్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గానికి మంజూరు చేసిన రూ.251 కోట్ల నిధులలో చుండూరు రైల్వే స్టేషన్ వద్ద రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఫ్లైవర్ నిర్మాణ పనుల ప్రాంతాన్ని ఆయన శాసన సభ్యులు నక్కా ఆనందబాబు, రైల్వే అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి నుండి పొన్నూరు వరకు ఉన్న గ్రామాల ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు రైల్వే లెవెల్ క్రాసింగ్ దాటి వ్యవసాయ పనులు, ఇతర గ్రామాలకు ప్రయాణానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని చుండూరు, ఆలపాడు గ్రామాల మధ్య రూ.50 కోట్లతో ఆర్‌ఓబిని, పొన్నూరు నియోజకవర్గం గాలెంవారిపాలెం నుండి అమర్తలూరు మండలం బోడపాడు గ్రామాల మధ్య మరో ఆర్‌ఓబిని రూ.51 కోట్లతో ఫ్లై ఓవర్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. శాసన సభ్యులు నక్కా

రైల్వే బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఆనందబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే నియోజకవర్గంలోని సమస్యలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి చుండూరు మండలంలోని నాలుగు గ్రామాల్లో రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద ఆర్వోబిలు ఏర్పాటు తోపాటు మరొక పనులు చేపట్టేందుకు రూ.251 కోట్లు నిధులు తీసుకొని వచ్చిన ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేసే బాధ్యత అధికారులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విజయవాడ డిఆర్ఎం, చుండూరు రైల్వే స్టేషన్ సూపరిండెంట్, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బుజ్జిబాబు

యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - చీరాల

బుజ్జిబాబు (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలం లోని జాండ్రపేట పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం చోటు చేసు కుంది. వేటపాలెం మండలం చేనేత పురి కాలనీ సమీపంలోని జగనన్న కాలనిలో నివాసం ఉంటున్న దిలీప్ కుమార్, సరోజిని దంపతుల చిన్న కుమారుడు సరిసిని బుజ్జిబాబు (18) చీరాలలోని మస్తం అపార్ట్మెంట్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న డీమార్ట్ వద్ద సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం విధులు ముగించుకొని ఇంటికి వెళ్లి ఒంట్లో అనారోగ్యంగా ఉండటంతో జాండ్రపేట వద్ద మెడికల్ షాపులో టాబ్లెట్స్ తీసుకుని ఇంటికి వెళుతున్న క్రమంలో రోడ్డు వైపు అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి ద్విచక్ర వాహనం ప్రమాదవశాత్తు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలు కాగా వెంటనే గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే అపాటికి యువకుడు పరిస్థితి విషమించడంతో వైద్య పరీక్షలు చేసిన వైద్యులు గుంటూరు తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులకు సూచించారు. గుంటూరు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా ఆ పాటికే తీవ్ర గాయాలైన బుజ్జిబాబు అపస్మారిక స్థితిలోకి చేరుకొని మృతి చెందాడు. అప్పటి వరకు తమతోనే ఉన్న కుమారుడు కళ్ల ముందు ఒక్కసారిగా జీవచ్ఛవంలా పడి ఉండడాన్ని చూసి ఆ తల్లిదండ్రులు తల్లడిల్లి పోయారు. బోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలలోని మార్చురీ గదికి తరలించారు.

చైర్మన్‌పై అవిశ్వాసంలో ఎలాంటి మార్పూ లేదు

- ఇచ్చిన మాటకే కట్టుబడి ఉంటా
- 14న చైర్మన్‌పై అవిశ్వాసం తప్పనిసరి
- నాతో ఉన్న కౌన్సిలర్లకే ప్రాధాన్యత : కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

మున్సిపల్ చైర్మన్‌పై ఈ నెల 14న అవిశ్వాసం తప్పకుండా ఉంటుందని, అందులో ఎలాంటి సందేహం లేదని ఎమ్మెల్యే కొండయ్య స్పష్టం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి కౌన్సిలర్లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రజలతోపాటు తమ కౌన్సిలర్లలోను అనేక అపోహలు వచ్చాయని, వాటిని నివృత్తి చేసేందుకే మీడియా సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవిశ్వాసానికి సరిపడా కౌన్సిలర్లు తమతో ఉన్నప్పటికీ అధిష్టానం ఆదేశాల మేరకే చైర్మన్‌ను పార్టీలోకి తీసుకున్నామని తెలిపారు. అయితే చైర్మన్ కూడా తనపై పెట్టిన అవిశ్వాసంలో ఓడినా, గెలిచిన తమ వెంటే ఉంటానని స్వయంగా చెప్పడంతో ఆహ్వానించామని అన్నారు. ఇప్పుడు వచ్చిన తాను చేసేదేమి లేదని, ఈపాటికే తమ వద్ద ఉన్న 22మంది

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

కౌన్సిలర్లకు మాట ఇచ్చానని అన్నారు. మరి కొంత మంది వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కావున ఇచ్చిన మాటకు కట్టుబడే ఉన్నానని అన్నారు. ఈ నెల 14న అవిశ్వాసం ఉంటుందని అన్నారు. ఈ లోపు చైర్మన్ రిజైన్ చేస్తారా? లేక అప్పుడు చేస్తారా అనేది ఆయన వ్యక్తిగత విషయం అన్నారు. పార్టీలో మొదటిసారి ఎవరినైతే తీసుకుంటామో అది క్యాడర్ అయినా కార్యకర్తలైన దానికే కట్టుబడి ఉంటానని అన్నారు. ఇక అవిశ్వాసానికి వస్తే చైర్మన్‌పై వ్యతిరేకత ఉంటేనే కౌన్సిలర్లు అందరూ తనతో వచ్చారని, సానుకూల పరిణామం ఉంటే రారు కదా అన్నారు. ఆ వ్యతిరేకత విషయం ఆయనకి కూడా తెలుసని అన్నారు. ఒక వేళ చైర్మన్ తమతో ఉన్నాసరే ఆయనకి సముచిత స్థానం ఉంటుందని, అది కూడా అవిశ్వాస తీర్మానం తర్వాతనే అన్నారు. కాబట్టి చైర్మన్ అభ్యర్థి విషయంలో తమ 22 మంది కౌన్సిలర్ల నిర్ణయమే తుది నిర్ణయం అన్నారు. తనతోపాటు ఎంపీ, 22 మంది కలసి నిర్ణయం తీసుకునే చైర్మన్ అభ్యర్థికి మాత్రమే ఓట్లు వేస్తామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్లు సురగాని లక్ష్మి, మల్లెల లలిత, దాసరి శారద, సల్లూరి సత్యానందం, మించాల సాంబశివరావు, ఉల్లిపాయల సుబ్బయ్య, గోలి జగదీష్, టిడిపి కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సిద్ధి వెంకట సుబ్బారావును సన్మానిస్తున్న దృశ్యం

సుబ్బారావుకు స్వర్ణనంది పురస్కారం

ప్రజాశక్తి - పంగులూరు

సామాజిక, సేవారంగంలో విశేష కృషి చేస్తున్న, విశేష సేవలు అందిస్తున్న విశ్వకర్మ సిద్దు సేవా ట్రస్ట్ వ్యవ స్థాపక చైర్మన్ సిద్దు వెంకట సుబ్బారావు జాతీయ పురస్కారం అందుకున్నారు. తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్, మాచవరం సేవా ఫౌండేషన్ ఏర్పాటు చేసిన స్వర్ణ నంది జాతీయ పురస్కారంను ఆయనకు ఆదివారం హైదరాబాదులో అందజేశారు. హైదరాబాదులోని త్యాగరాజ గాన సుధా భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాచవరం సేవా ఫౌండేషన్ చైర్మన్ గౌరీ శంకర్, ఆధ్యాత్మిక గురువు దైవజ్ఞ శర్మ, సాహితీవేత్త సురేపల్లి విజయ, న్యూమరాలజిస్ట్ ముదికొండ గోపికృష్ణ తదితరులు సిద్దు సుబ్బారావుకు శాలువాతో ఘనంగా సత్కరించి స్వర్ణనందిని బహుకరించారు. గతంలో జాతీయ స్థాయిలో ఢిల్లీలో దారుశిల్పి విశ్వకర్మ అవార్డును రెండు తెలుగు రాష్ట్రాల్లో సాధించిన ఏకైక వ్యక్తిగా సిద్దు వెంకట సుబ్బారావు గుర్తింపు పొందారు. ఆయన స్వర్ణ నంది పురస్కారం అందుకోవడం పట్ల ముప్పవరం గ్రామస్తులు, పంగులూరు విశ్వ బ్రాహ్మణ సంఘీయులు హర్షం వ్యక్తం చేశారు.

దాతలు నిర్మించిన షెడ్డు ప్రారంభిస్తున్న శ్రీమన్నారాయణ

ఉచిత వైద్య సేవకు షెడ్ నిర్మాణం

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని పందిల్లపల్లిలో గత 30ఏళ్లుగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరంనకు వచ్చే పేషెంట్ల సౌకర్యార్థం ఎన్ఆర్ఐ పల్లపోలు రమేష్ రూ.40 వేలు వెచ్చించి ఆర్‌సిసి రేకుల షెడ్డు, ఔషధాల భద్రతకు ఇనుప బీరువా, పేషెంట్లు కూర్చునేందుకు బల్లలు వగైరాను తన తల్లి, దండ్రులు పల్లపోలు శివరాం వెంకట సుబ్బరావమ్మ ఆధ్వర్యంలో నిర్మించినట్లు ఉచిత వైద్య శిబిర నిర్వాహకులు సుబ్బారావు అలియాస్ షారుక్ తెలిపారు. గ్రామ పెద్దలు ఊటుకూరు శ్రీమన్నారాయణ, డాక్టర్ బొగ్గుల బ్రహ్మం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి బ్రహ్మం మాట్లాడుతూ సేవా దృక్పథంతో మూడు దశాబ్దాలుగా సుబ్బారావు చేస్తున్న ఉచిత వైద్య సేవలు అభినందనీయమని తెలిపారు. దాతలు అందించిన సహకారంతో పేదలకు వైద్య సేవలు అందించడం ఆదర్శనీయమని అన్నారు. గ్రామ పెద్దలు ఊటుకూరు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఎంతోమంది మధుమేహ వ్యాధిగ్రస్తులు, ప్రమాదాల వలన గాయాల పాలైన వారికి ఉచిత సేవలందిస్తున్న సుబ్బారావు వలన పందిళ్ళపల్లి గ్రామానికి మంచి పేరు లభిస్తుందని కొనియాడారు. ఈ సందర్భంగా సుబ్బారావును అభిమానులు శాలువాతో సత్కరించారు.

సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది

చేనేతపురిలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - వేటపాలెం

మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ చేనేతపురి కాలనీ నందు అంతర్జాతీయ కార్మిక దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పోక్సో, మహిళా కార్మిక చట్టం, వయోవృద్ధుల చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టాల గురించి అవగాహన కల్పించారు. లోక్ అదాలత్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది ఎం రామకృష్ణరెడ్డి అన్నారు. కార్యక్రమంలో మహిళా ప్రతినిధి యు స్నేహ, పిఎల్‌విఎస్‌డి మతీన్, స్వయం సహాయక సంఘాల సమాఖ్య అధ్యక్షురాలు నీలందామేశ్వరి పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రాస్తారోకో

ప్రజాశక్తి - ముండ్లమూరు

అద్దంకి, దర్శి రోడ్డులోని ముండ్లమూరు విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద పోలవరం గ్రామ ప్రజలు ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. గత మూడు రోజులుగా పోలవరంకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామంలో తాగేందుకు పశువులకు నీరు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ఫ్యాన్లు, ఏసీలు పనిచేయక దోమలు కుట్టి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, అధికారులకు చెప్పిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విసిగి వేసారిన గ్రామస్తులు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. దీంతో అద్దంకి, దర్శి రోడ్డులో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచి పోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామంలో మంచినీటికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని శంకరాపురం వెళ్లి తెచ్చుకున్నట్లు తెలిపారు. తాగేందుకు నీరు లేక ఒక ఆవు చనిపోయిందని తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి రాస్తారోకో విరమించాలని కోరారు. విద్యుత్ అధికారులు వచ్చి హామీ ఇచ్చేవరకు విరమించమని చెప్పారు. విషయం తెలుసుకున్న టిడిపి ఇన్చార్జ్ గొట్టిపాటి లక్ష్మి రాస్తారోకో వద్దకు టిడిపి మాజీ అధ్యక్షులు సోమేపల్లి శ్రీనివాసరావును పంపి అతనితో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులతో మాట్లాడించి విద్యుత్తు పునరుద్ధరణ చేయించేందుకు కృషి చేస్తామని చెప్పడంతో రాస్తారోకో విరమించారు.

రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న దృశ్యం

శనగల క్లీనింగ్ మిషన్లకు పెరిగిన గిరాకీ

ప్రజాశక్తి - ఇంకొల్లు

శనగ పంట సాగుకు సంబంధించి గత రెండేళ్లుగా క్లీనింగ్ మిషన్లకు గిరాకీ ఉంటుంది. దీంతో ఇంకొల్లు పరిసర గ్రామాల్లో నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరు తదితర గ్రామాల్లో నూతనంగా క్లీనింగ్ మిషన్లు ఏర్పాటు చేస్తున్నారు. శనగ పంట కోత దశకు వచ్చిన తరువాత గతంలో మనుషులు ద్వారా కూలి ఇచ్చి పీకించేవాళ్లు. పీకిన శనగ పంట కుప్పలను ట్రాక్టర్ ద్వారా శనగ నూర్పిడి చేసేవారు. అయితే గత నాలుగేళ్లుగా మారిన యాంత్రీకరణతో కాలానుగుణంగా కొత్తగా ఒకేసారి శనగ విత్తనాలు బయటకు తీసే హార్వేస్టర్లు రంగప్రవేశం చేశాయి. ఇది రైతులకు సులువు పద్ధతిగా ఉండటంతో 95 శాతం రైతులు హార్వేస్థర్టర్ ద్వారానే శనగనూర్పిడి చేస్తున్నారు. హార్వేస్టర్ ద్వారా సెనగ పంట కోత కోసిన సమయాల్లో శనగల తోపాటు మట్టి, పుల్ల, కాయ తదితర వ్యర్థాలు వస్తూ ఉన్నాయి. దీంతో వ్యాపారులు శనగల వ్యర్థాలు యంత్రాల ద్వారా వేరు చేస్తేనే కొనుగోలు చేస్తామని అంటున్నారు. శనగలు ప్రాసెసింగ్ చేయకుండా, వ్యర్థాలు వేరు చేయకుండా రైతు వద్ద కొనాలన్నా 65 కేజీల బస్తాకు అందులో వచ్చే మట్టి వ్యర్థాలను బట్టి బస్తాకు 3నుంచి 6 కేజీల వరకు వ్యాపారులు తూకం తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. అది మట్టి వ్యర్థాలు ఎక్కువగా ఉంటే అసలు కొనుగోలు చేయకుండా క్లీనింగ్ ప్రాసెస్ చేయమని, చేస్తేనే కొంటామని ఆంక్షలు విధిస్తున్నారు. ఉప్పుగుండూరు తదితర ప్రాంతాల్లో కూడా నూతనంగా మిషన్లు ఏర్పాటు చేశారు. దీనితో ఈ ఏడాది శనగల ప్రాసెసింగ్ అండ్ క్లీనింగ్ మిషన్లకు కొంచెం ఒత్తిడి తగ్గింది. శనగ సాగు విస్తీర్ణం పెరిగితే ఇప్పుడు నూతనంగా ఏర్పాటు చేసిన క్లీనింగ్ మిషన్లతో పాటు మరో మూడు అదనంగా నిర్మించే ప్రయత్నంలోనూ ఈ ప్రాంత వాసులు ఉన్నారు.

కొణికి రోడ్డులో ఏర్పాటు చేసిన క్లీనింగ్ మిషన్

కూలీలతో వేయాలంటే ఖర్చు ఎక్కువ

శనగ పంట మనుషుల తోటి పీకించి ట్రాక్టర్ మిషన్ వేస్తే ఖర్చు ఎక్కువవుతుంది. ఎకరాకు పీకుడు కూలి రూ.4వేల వరకు అవుతుంది. ట్రాక్టర్ మిషన్ ఖర్చు మరో రూ.4వేలు అవుతుంది. గింజల బాడుగ, గోతాలు అన్ని కలిపి ఎకరాకు రూ.10వేల వరకు ఖర్చు అవుతుంది. శనగ పంట పీకి కుప్పలు వేసిన నాటి నుంచి నూర్పిడి అయిపోయే వరకు వాతావరణం ఎలా ఉంటుందోననిఆందోళన రైతుల్లో ఉంటుంది.

హార్వేర్టర్‌తో తక్కువ ఖర్చు

ప్రస్తుతం రైతులు మొగ్గు చూపుతున్న హార్వేర్టర్ నూర్పిడితో అయితే రోజుకు 20ఎకరాలపైనే మిషన్ కోత చేస్తుంది. ఖర్చు కూడా ఎకరాకు రూ.2వేల నుంచి రూ.2200 అవుతుంది. గోతాలు, బాడుగ, ప్రాసెస్ క్లీనింగుకు మరో రూ.2వేలు ఖర్చు అవుతుంది. మొత్తం ఎకరాకు సగటున రూ.4వేల నుంచి రూ.4500 తో ఇంటికి చేరుతుంది. దీనికి తోడు ఒక్క గంటలోనే ఎకరం విస్తీర్ణం కోత పూర్తవుతుంది. దీంతో రైతులు హార్వేస్టర్ కోత సులువు, ఖర్చు తక్కువగా ఉంటుందని మొగ్గు చూపుతున్నారు. హార్వేష్ట ర్ ద్వారా ఎకరాకు 50 నుంచి 70 కేజీల వరకు గింజలు వృధా అవుతున్న పరిస్థితులు కూడా ఒక్కో సందర్భంలో ఉంటుంది.

గిరిజన గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - రేపల్లె

స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల్లో 2024-25 పంవత్స రానికి 3నుంచి 9తరగతుల్లో చేరేందుకు ఈ నెల 31లోపు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ కె ప్రసాదరావు తెలిపారు. 3వ తరగతిలో 40 సీట్లకు గాను ఎస్టి 32, ఎస్సీ 5, బీసీ 2, 4వ తరగతిలో 37, ఐదో తరగతి 35, 6వ తరగతి 37, 7వ తరగతి 28, 8వ తరగతి 25, 9వ తరగతిలో 21 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాల కొరకు 9603841193 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - యద్దనపూడి

యద్దనపూడిలోని పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి దేవాలయం 57వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. పూజల అనంతరం భక్తులుకు తీర్ధ ప్రసాదాలు పంచారు. భక్తులకు అన్నాదానం చేశారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు గోనుగుంట్ల వెంకట సుబ్బారావు, అనంతలక్ష్మి, సత్యనారాయణ, విమల, రఘు బాబు, లక్ష్మికుమారి, నాగాంజనేయులు, శిరీష, ఆలయ పర్యవేక్షకులు సుందరమ్మ పాల్గొన్నారు.

సంతమాగులూరు : మండలంలోని కామేపల్లిలోని శివాలయం 25వ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో శివపార్వతి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు జరిపారు. ఈ సందర్భంగా శివాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - మేదరమెట్ల

మండలంలోని కొరిశపాడు ఫ్లైఓవర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొనటంతో వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. మృతుడు దైవా లరావూరు గ్రామంకు చెందిన గాలి వీరయ్య (65)గా గుర్తించారు. శనివారం ఇంటి నుండి బయలుదేరి వచ్చినట్లు కుటుంబీకులు తెలిపారు. మెదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన వృద్ధుడు వీరయ్య

నల్లబర్లీ పొగాకును

రూ.15 వేలకు తగ్గకుండా కొనాలి

కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు

ప్రజాశక్తి-పర్చూరు

నల్లబర్లీ పొగాకుకు రూ.15 వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం రైతు సంఘం నాయకులు స్థానిక రైతులతో సిపిఎం కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ రైతులు తెచ్చిన పొగాకు బేళ్లను తిప్పి పంపవద్దని సూచించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ కమిషనర్ పొగాకు కొనుగోలు ప్రాంతాన్ని సందర్శించాలని డిమాండ్ చేశారు. రైతులు ప్రభుత్వానికి తమ గోడుని వినిపించేదుకు టోల్ ఫ్రీ నెంబరును ఏర్పాటు చేయాలని కోరారు. వీటిని నిత్యం పర్యవేక్షించేందుకు ఒక మానిటరింగ్ కమిటీని కూడా ఏర్పాటు చేయాలన్నారు. బర్లి పొగాకుని టుబాకో బోర్డు పరిధిలోకి తెచ్చి రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి టి.రామారావు, కౌలురైతు సంఘం నాయకులు సిహెచ్.గంగయ్య, సిపిఎం నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు, మత్తె డేవిడ్, వణుకూరి శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హరిబాబు

న్యాయం కోసం పనిచేయాలి

- న్యాయవాదులకు హైకోర్టు న్యాయమూర్తుల సూచన- శింగరాయకొండలో కోర్టు ప్రారంభం

ప్రజాశక్తి-శింగరాయకొండ

న్యాయవాదులు న్యాయం కోసం పనిచేయాలని హైకోర్టు న్యాయమూర్తులు సూచించారు. శింగరాయకొండలో సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టును హైకోర్టు న్యాయమూర్తులు ఆదివారం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి, ప్రకాశం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి తర్లాడ రాజశేఖర్‌రావు కోర్టు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కోర్టు భవనాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ కె.మన్మథరావు ప్రారంభోత్సవం చేశారు, జస్టిస్ గన్నమనేని రామకష్ణప్రసాద్, జస్టిస్ వై.లక్ష్మణరావు కోర్టులోని కార్యాలయాలను ప్రారంభించారు. ముందుగా హైకోర్టు న్యాయమూర్తులకు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని న్యాయమూర్తులకు న్యాయవాదులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభకు ప్రకాశం జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎ.భారతి అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి హైకోర్టు న్యాయమూర్తి, ప్రకాశం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి టి.రాజశేఖర్‌రావు మాట్లాడుతూ ఈ ప్రాంతానికి ఈ కోర్టు చాలా అవసరమని వివరించారు. ప్రతి ఒక్కరికీ న్యాయం అందే విధంగా ఈ కోర్టు ఉపయోగపడుతుందని సూచించారు. ప్రతి ఒక్కరికీ ఈ కోర్టు ద్వారా న్యాయం పొందే విధంగా ఇక్కడ సిబ్బంది పని చేస్తారన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె.మన్మథరావు మాట్లాడుతూ శింగరాయకొండకు కోర్టు అవసరమని 1991లోనే అనుకోవడం జరిగిందన్నారు. ఇక్కడ కోర్టు లేక కందుకూరు కోర్టుకు వెళుతున్నారని చెప్పారు. తాను కూడా అదే రీతిలో కందుకూరుకి వెళ్లి న్యాయ వృత్తిని చేశానన్నారు. 2013లో అప్పటి ఎమ్మెల్సీగా ఉన్న పిడిఎఫ్ శాసనమండలి సభ్యులు దాచూరి రామిరెడ్డి ఒక కార్యక్రమంలో శింగరాయకొండకు కోర్టు అవసరమని వివరించారని గుర్తుచేశారు. అప్పుడు ఫైలు సిద్ధం చేస్తే.. అది ఇప్పటికి పూర్తయ్యిందన్నారు. నలుగురు హైకోర్టు న్యాయమూర్తులు శింగరాయకొండకు వచ్చి ఈ కోర్టును ఆవిష్కరించడం జరగడం చాలా మంచి శుభపరిణామమని వివరించారు. తాను కర్ణాటక హైకోర్టుకు బదిలీ అవ్వడం జరిగిందన్నారు. న్యాయవాదులు న్యాయం కోసం పనిచేయాలని సూచించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకష్టారావు మాట్లాడుతూ ఈ కోర్టు ఎంతో మందికి ఉపయోగపడే విధంగా ఉంటుందన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వై లక్ష్మణరావు మాట్లాడుతూ శింగరాయకొండ లో శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం చాలా ప్రసిద్ధి కలిగిందని, ఈ ప్రాంతం అంతా ప్రశాంతమైన వాతావరణం ఉంటుందని చెప్పారు. ఈ కోర్టు ఎంతో మందికి ఉపయోగపడే విధంగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎస్పీ దామోదర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సన్నెబోయిన శ్రీనివాసులు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని కోర్టుల న్యాయమూర్తులు పాల్గొన్నారు. అనంతరం ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి వచ్చిన న్యాయమూర్తులను ఘనంగా సత్కరించారు. హైకోర్టు న్యాయమూర్తులను జిల్లా జడ్జి ఎ.భారతి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సన్నెబోయిన శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

గౌరవ వందనం స్వీకరిస్తున్న హైకోర్టు జిల్లా న్యాయమూర్తులు

నిరసన తెలుపుతున్న సిహెచ్‌ఒలు

మంత్రి వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

- లేకుంటే సమ్మె మరింత ఉధృతం

- ఆరో రోజూ సిహెచ్‌ఒల ఆందోళన

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

'విలేజ్ క్లినిక్స్'లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఎపిఎంసిఎ నాయకులు ధ్వజమెత్తారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తమని సమ్మె విరమించుకుంటే ఉద్యోగంలో నుంచి తొలగిస్తామని బెదిరించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసారు. మంత్రి వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపట్ల నిరసన వ్యక్తం చేస్తూ, సమ్మెను ఉధతం చేస్తామని హెచ్చరించారు. సిహెచ్‌ఒల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మె 6వ రోజుకు చేరింది. ఆదివారం నాడు ప్రకాశం భవనం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీకాంత్, ప్రకాశం జిల్లా సెక్రెటరీ ప్రసన్న, ఉపాధ్యక్షులు ఎన్.జీవన్ జ్యోతి, రామాంజనేయులు, కామేష్ మాట్లాడారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో అగ్నిప్రమాదాల నివారణ

- వేసవిలో అప్రమత్తంగా ఉండాలి..

- అగ్ని ప్రమాదం సంభవిస్తే 101కి ఫోన్ చేయండి

- జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మాధవనాయుడు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అగ్నిప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజానీకం అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సి.మాధవ నాయుడు తెలిపారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్తలు, అవి సంభవించిన సందర్భాల్లో తీసుకోవలసిన చర్యల గురించి ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

జిల్లాలో చీరాల, అద్దంకి, రేపల్లె, బాపట్లలో అగ్నిమాపక కేంద్రాలున్నాయి. వీటిలో నాలుగు అగ్నిమాపక వాహనాలు ఉన్నాయి. చీరాలలో ఒక మిస్ట్ జీప్ ఉంది. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు 447 అగ్నిప్రమాదాలకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది తక్షణమే ఘటనా స్థలానికి వెళ్లి నష్టనివారణ చర్యలు చేపట్టారు. ఈ ఘటనల్లో రూ.7 కోట్ల 24 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లగా, రూ13 కోట్ల 75 లక్షల ఆస్తి నష్టం జరగకుండా చూశారు. ఈ అగ్నిప్రమాదాలు, నీట మునిగిన ప్రమాదాల్లో జిల్లాలో తొమ్మిది మంది మరణించారు. జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో 56 మంది అగ్నిమాపక సిబ్బంది, 8 మంది హోం గార్డులు పనిచేస్తున్నారు. అగ్ని ప్రమాదం సంభవిస్తే 101కి ఫోన్ చేయాలి. జిల్లాలోని అద్దంకిలో రూ.2.26 కోట్లతో అగ్నిమాపక కేంద్ర భవననిర్మాణం జరుగుతోంది. చీరాలలో కూడా భవన నిర్మాణం కోసం రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

గ్రామీణ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

గ్రామీణ ప్రాంతాల్లో గుడిశెలు, గడ్డివాములు, తాటాకు పందిళ్ళ మొదలగు వాటి దగ్గరలో ఎట్టి పరిస్థితుల్లోనూ టపాసులు కాల్చరాదు. ఎండు గడ్డిని ట్రాక్టర్లు, లారీలు, ఎడ్ల బండ్లపై తెచ్చే సందర్భాల్లో తక్కువ ఎత్తులోనే గడ్డి వేసుకుని తరలించాలి. లేదంటే దారిలో విద్యుత్ వైర్లు తగిలి షార్ట్ సర్క్యూట్ జరిగి గడ్డితో పాటు వాహనం కూడా కాలిపోయే ప్రమాదం ఉంది. విద్యుత్ తీగలకు దగ్గరలో వాటి కింద గడ్డివాములు వేయకూడదు. గడ్డి వాములు నివాసాలకు దూరంగా ఉండాలి. గడ్డివాములకు దగ్గరలో అగ్గం ముక్కలు ఉండకుండా చూసుకోవాలి. ఎలక్ట్రికల్ విడి వైర్లను సాకెట్లలో ఉంచకూడదు. ఖచ్చితంగా ప్లగ్‌లు ఉపయోగించాలి. గుడిసెల్లో ఎలక్ట్రికల్ వైర్ల జాయింట్లు ఉండకూడదు. ఒక ప్లగ్ లో ఎక్కువ కనెక్షన్లు ఇవ్వకూడదు. గుడిసెకు, మరో గుడిసెకు మధ్య కనీస దూరం ఉండేలా చూడాలి. వంట పొయ్యిని ఉపయోగించాక.. నుసి బొగ్గుని పూర్తిగా ఆర్పకుండా చెత్త కుప్పలో పారవెయ్యకూడదు. దీని వల్ల తిరిగి మంటలు ఏర్పడి అగ్ని ప్రమాదాలు జరుగుతాయి.

అప్రమత్తంగా ఉండాలి..

గ్యాస్ లీక్ అయితే వెంటనే రెగ్యులేటర్ వాల్వు ఆపేయాలి. ఎలక్ట్రికల్ స్విచ్‌లు ఆన్ చేయ్యకూడదు. గాలి, వెలుతురు కోసం అన్ని కిటికీలు, తలుపులు తెరవాలి. అలానే అగ్ని ప్రమాదాలు తరచుగా ఇళ్లు, కర్మాగారాలు, కార్యాలయాలు మొదలైన చోట్ల సంభవిస్తాయి. అగ్నిప్రమాదం సంభవించినప్పుడు, ప్రమాదంలో చిక్కుకున్నప్పుడు కంగారు పడటం, పరిగెత్తడం చెయ్యకూడదు. ప్రశాంతంగా ఉండి.. అందరినీ అప్రమత్తం చెయ్యాలి. దగ్గరలో తప్పించుకునేందుకు ఉన్న మార్గాన్ని ఉపయోగించాలి. భవనంలో మెట్ల మార్గాన్ని మాత్రమే వినియోగించాలి. లిఫ్ట్‌లు ఉపయోగించకూడదు.

వేసవిలో అగ్ని వేగంగా వ్యాప్తి..

వేసవిలో చిన్న నిప్పు క్షణాల్లో పెద్ద మంటగా మారి చుట్టూరా వ్యాప్తి చెంది అతి పెద్ద అగ్ని ప్రమాదంగా మారుతుంది. క్షణాల్లో మంటలు చుట్టుముడతాయి. ఇలాంటి సందర్భాల్లో మంటల నుంచి బయట పడేందుకు చాలా తక్కువ సమయం ఉంటుంది. అగ్ని వల్ల వచ్చే వేడి మనుషుల ప్రాణాలను హరిస్తుంది.ఇలాంటి సందర్భాల్లో ఇంటిలో ఉష్ణోగ్రత నేలపైన 100 డిగ్రీల సెల్సియస్ ఉంటే ఆ ఇంటి ఉపరితలంపై సమతులంగా 600 డిగ్రీల సెల్సియస్ ఉంటుంది. తీవ్రమైన వేడి గాలి పీల్చడం వల్ల మన ఊపిరితిత్తులు దహించబడతాయి. అగ్ని ప్రమాదంలో వచ్చే మంటలు వేడిని, పొగ మరియు విషవాయువులను జనింపచేస్తాయి. ఈ పొగ విష వాయువులు వేడి కంటే ముందు చాలా వేగంగా వ్యాపించి ప్రాణాలు తీస్తాయి. కొద్దిగా పొగ విషవాయువులను పీల్చుకున్నా కూడా మైకం కమ్ముతుంది.స్పృహ తప్పేలా చేస్తుంది. అందువల్ల అగ్ని ప్రమాద సమయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలి.

నల్లూరి కాంతమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి-చీమకుర్తి

ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర కార్యదర్శి నల్లూరి మాధవరావు మాతృమూర్తి నల్లూరి కాంతమ్మ ఈ నెల 20న మృతిచెందారు. ఆదివారం నాడు పెద్దకర్మ సందర్భంగా చీమకుర్తి మండలంలోని జిఎల్‌పురంలోని వారి నివాసం వద్ద కాంతమ్మ చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాల వేసి.. నివాళులర్పించారు. నల్లూరి మాధవరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ ఎం.సుధీర్‌కుమార్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర మంత్రి డోలా వీరాంజనేయ స్వామి, రాష్ట్ర మాజీ డిజిపి ఏబీ వెంకటేశ్వరరావు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, రాష్ట్ర మాజీ మంత్రి మేరుగ నాగార్జున, సిపిఎం రాష్ట్ర నాయకులు వై వెంకటేశ్వరరావు, వై సిద్ధయ్య, జాలా అంజయ్య, ఆంధ్రా మాల్యాద్రి, సిపిఎం తెలంగాణ రాష్ట్ర నాయకులు పంగులూరి ప్రభాకర్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్ కె మాబు, జిల్లా నాయకులు పూనాటి ఆంజనేయులు, పమిడి వెంకటరావు, పూసపాటి వెంకటరావు, జీవీ.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎంఎల్వి ప్రసాద్ రావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, కార్యదర్శి ఎం రమేష్ పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు